సాక్షి
మెదక్
గురువారం । 12 । జూన్ । 2025



'బడి'వడిగా.. సరికొత్తగా..

పాఠశాలల పునఃప్రారంభం వేళ.. పలువురి మనోభావాలు.. పలు స్కూళ్ల ఘనతపై కథనాలు.. వివరాలు 8లో ▸



సర్కారు బడికి టీచర్ కుమారుడు

తాను పనిచేస్తున్న పాఠశాలలోనే ఓ ఉపాధ్యాయురాలు తన కుమారుడిని చేర్పించారు. వివరాలు 8లో ▸



కొత్త భవనం కలేనా..!

అల్లాదుర్గంలో ఆరేళ్లుగా కేజీబీవీ కళాశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

మెదక్ కలెక్టరేట్: ఈనెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా లోక్ అదాలత్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆర్ఎం సుభవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఆ బాధ్యత ప్రభుత్వానిదే: పీఆర్టీయూ

మెదక్ కలెక్టరేట్: ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించే బాధ్యత ప్రభుత్వానిదేనని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మల్లారెడ్డి అన్నారు. బుధవారం మెదక్‌లో ఆయన మాట్లాడుతూ.. నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం అవుతున్నాయని, జిల్లాలోని చాలా వరకు బడుల్లో కనీస వసతులు లేవన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో విద్యార్థులను నాణ్యమైన విద్యకు దూరం చేయొద్దన్నారు. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా ప్రభుత్వం మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. అందులోని విద్యార్థులను ప్రాథమిక పాఠశాలల్లో చేర్చుకొనే అవకాశం ఉందన్నారు. దీంతో పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య పెరిగే అవకాశం ఉంటుందన్నారు.

392 మందికి సీట్ల కేటాయింపు



కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీకి బుధవారం రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ హరిబాబు తెలిపారు. జిల్లాలోని వివిధ ఎంజేపీ గురుకులాల్లో 6 నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న 392 సీట్లు భర్తీ చేయగా, ఇందులో 217 మంది బాలికలు, 175 మంది బాలురు ఉన్నట్లు చెప్పారు. వీరికి గురుకుల పాఠశాలలో అడ్మిషన్ పొందేందుకు అలాట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చినట్లు వివరించారు.


దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని దొంతిలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను రద్దు చేసే వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు రవీంద్ర ప్రసాద్, శంకర్, ప్రభాకర్, లక్ష్మణ్, వసంత, శ్రీకాంత్, పాల్గొన్నారు.

కొనసాగుతున్న ధ్రువపత్రాల పరిశీలన



ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న సిబ్బంది

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని డైట్ కళాశాలలో డీసెట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది. 9వ తేదీ నుంచి ప్రక్రియ ప్రారంభం కాగా బుధవారం వరకు 900మంది సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డీఈఓ రాధాకిషన్ తెలిపారు. మొత్తం 2,198 మందికి గాను నాలుగు కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మిగితా విద్యార్థులు 11వ తేదీ లోపు హాజరుకావొచ్చని సూచించారు. 13వ తేదీన అభ్యర్థుల ర్యాంకును బట్టి సీట్లు కేటాయించనున్నట్లు చెప్పారు.

ఏరువాక.. జోరుగా సాగాలిక



రేగోడ్‌లో అలంకరించిన ఎద్దులతో రైతులు

జిల్లాలో ఏరువాక పౌర్ణమిని బుధవారం రైతులు ఘనంగా నిర్వహించారు. ఎడ్లను అందంగా అలంకరించి డప్పు చప్పుళ్లతో గ్రామాల్లో ఊరేగించారు. భూదేవిని నమ్ముకొని సాగు చేస్తున్నామని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని దేవుడిని వేడుకున్నారు. రైతులు, యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఆటాపాటలతో వేసవి సెలవులను సరదాగా గడిపిన విద్యార్థులు గురువారం నుంచి బడిబాట పట్టనున్నారు. ఇందుకోసం విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. నూతన విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ తొలిరోజే అందించేందుకు సిద్ధం చేసింది. ఇక తల్లిదండ్రులు పొద్దున్నే పిల్లలను రెడీ చేయడం, పాఠశాలలకు వెళ్లబోమని మారం చేస్తే బుజ్జగించడం వంటివి మొదలు కానున్నాయి. – మెదక్‌జోన్



బడికి వేళాయె..!

నేటి నుంచి పునఃప్రారంభం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట
- జిల్లావ్యాప్తంగా 922 పాఠశాలలు, 87 వేల మంది విద్యార్థులు

జిల్లావ్యాప్తంగా మొత్తం 922 పాఠశాలలు ఉండగా, వాటిలో 87 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాగా గతేడాది ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా 562 పాఠశాలలను ఎంపిక చేసి మరమ్మతుల కోసం రూ. 20 కోట్లు విడుదల చేసింది. ఆ నిధులతో తాగు నీటి సౌకర్యం, పాఠశాలల పైకప్పుల మరమ్మతులు, మరుగుదొడ్లు, కిచెన్‌షెడ్లు, పాఠశాలల చుట్టూ ప్రహరీ, కరెంట్ మరమ్మతులు, కిటికీలు, తలుపులకు రిపేర్లు చేయించి మౌలిక వసతులు కల్పించారు.

బడిబాటలో 1,800 మంది గుర్తింపు

జిల్లాలో బడిబాటను ఈనెల 6 నుంచి ఉపాధ్యాయులు ప్రారంభించారు. ఇది ఈనెల 19 వరకు కొనసాగించనున్నారు. అయితే ఇప్పటికే 1,800 విద్యార్థులను గుర్తించి వివిధ పాఠశాలల్లో చేర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా వేసవి సెలవుల్లో ముందస్తు బడిబాటలో భాగంగా జిల్లాలో డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించారు. ఇంటింటికీ తిరిగి సర్కారు బడిలో కల్పిస్తున్న సౌకర్యాలు, బోధన గురించి తల్లిదండ్రులకు వివరించారు. అలాగే వివిధ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి చదువు ప్రాధాన్యతను చెప్పారు. ఇదిలా ఉండగా అంగన్‌వాడీ పాఠశాలల నుంచి 7 వేల పైచిలుకు విద్యార్థులు ప్రాథమిక పాఠశాలల్లో చేరనున్నారు.

భవిత సెంటర్లకు రూ. 1.20 కోట్లు

దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్ కోసం జిల్లాలో 21 భవిత సెంటర్లను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా వాటిలో ప్రస్తుతం నాలుగింటికి మాత్రమే సొంత భవనాలు ఉండగా, మండలానికో పాఠశాలను గుర్తించి వాటిలో భవిత సెంటర్లు కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు నిత్యం వైద్య పరీక్షలు నిర్వహించి వినికిడి యంత్రాలతో పాటు చేతికర్రలు, ఇతర పరికరాలను అందుబాటులో ఉంచుతున్నారు. వీరికి ఆట వస్తువులను చూపుతూ చదువు చెబుతారు. అయితే ఆ సెంటర్లలో మరుగుదొడ్లు, తాగునీరు తదితర అవసరాల కోసం రూ. 1.20 కోట్ల నిధులు విడుదల కాగా, మరమ్మతులు చేపడుతున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యంగా జిల్లావ్యాప్తంగా 3,400 మంది ఉపాధ్యాయులకు గత నెలలో 19 రోజుల పాటు పలు అంశాలపై టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఇందులో ప్రధానంగా విద్యార్థుల స్థాయిని గుర్తించడం, వెనుకబడిన వారికి అర్థమయ్యేలా బోధించడం, మారుతున్న బోధనా విధానాలను అనుసరించడంతో పాటు ఏఐపై అవగాహన కల్పించారు.

పుస్తకాలు, యూనిఫామ్స్ రెడీ

తొలిరోజే విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్స్‌ను అందించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 4,60,408 పుస్తకాలు అవసరం ఉండగా, ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరాయి. అలాగే ఒక్కో విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫాం అందించాల్సి ఉంది. ఇప్పటివరకు 80 శాతం మాత్రమే కుట్టడం పూర్తికావడంతో మొదటి రోజున ఒక్కో జత అందించేందుకు సిద్ధమయ్యారు. మరో వారం రోజుల్లో మరో జత యూనిఫాం అందజేస్తామని సంబంధిత అధికారులు చెబుతున్నారు.

సర్కారు బడిలోనే సంపూర్ణ విద్య



సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తోంది. అన్ని అర్హతలు గల ఉపాధ్యాయులచే బోధన సాగుతుంది. అలాగే పాఠశాలలను అన్ని హంగులతో తీర్చిదిద్దాం. పుస్తకాలు, యూనిఫామ్స్ ఉచితంగా అందజేస్తాం. తల్లిదండ్రులు విద్యార్థులను సర్కారు బడుల్లోనే చేర్పించాలి.

– రాధాకిషన్, డీఈఓ

పోషకాహార లోపాన్ని నివారిద్దాం

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి

నర్సాపూర్ రూరల్: పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతివారం ఎగ్ బిర్యానీ వంటకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో కలిసి ఎగ్ బిర్యానీ వంటకం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు పోషకాహారంతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను నేర్పించి వారిలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేస్తూ వేతనాలు పెంచిందన్నారు. పిల్లలకు ఆట వస్తువులతో పాటు పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ హేమ భార్గవి, ఎంపీడీఓ మధులత, సూపర్‌వైజర్ సరళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



పిల్లలతో కలిసి భోజనం చేస్తున్న సుహాసినిరెడ్డి

ఇక డబ్బులు పెట్టలేం..

చిన్నశంకరంపేట(మెదక్): పంచాయతీలకు నిధులు రాకున్న 16 నెలలుగా అప్పులు చేసి పనులు సాగించాం. ఇక డబ్బులు పెట్టలేం.. చెత్త ట్రాక్టర్లను గ్రామంలో తిప్పలేమని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ దామోదర్‌కు ట్రాక్టర్ తాళాలను అప్పగించారు.



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న కార్యదర్శులు

గడువులోగా ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

నిర్లక్ష్యం వహిస్తే కొత్తవారికి అవకాశం

- జిల్లాకు 9,815 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 'సాక్షి'తో హౌసింగ్ పీడీ మాణిక్యం



మెదక్ కలెక్టరేట్: ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని, నిర్లక్ష్యం వహిస్తే అర్హులైన ఇతరులకు అవకాశం కల్పిస్తామని జిల్లా హౌసింగ్ పీడీ మాణిక్యం తెలిపారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. జిల్లాను పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి మొదటి విడతలో 1,555, రెండో విడతలో 8,260 ఇళ్లు మంజూరు చేసిందన్నారు. కాగా జిల్లాలో మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలతో పాటు సంగారెడ్డి జిల్లాలోని ఆందోల్, నారాయణఖేడ్, సిద్దిపేటలోని దుబ్బాక, గజ్వేల్, నియోజకవర్గాలకు సంబంధించిన మరో 8 మండలాలు మెదక్ జిల్లాలోనే ఉన్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం మొత్తం 9,815 ఇళ్లను మంజూరు చేసిందని వివరించారు.

రూ.1.80 కోట్ల బిల్లులు చెల్లించాం

జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన 180 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.1.80 కోట్లు జమ చేశాం. జిల్లాలో 450 మంది ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా.. మిగితా లబ్ధిదారులు ఇంకా ప్రారంభించలేదు. ఉచితంగా ఇసుక అందించడంతోపాటు నిర్మాణాలు ప్రారంభించగానే వారంవారం బిల్లులు మంజూరు చేస్తామని చెబుతున్నా, లబ్ధిదారుల్లో మార్పు రావడం లేదు. అలాంటి వారిని పక్కన పెట్టి వారి స్థానంలో ఇతరులకు అవకాశం కల్పిస్తాం.

మున్సిపాలిటీల్లో ప్రారంభిస్తున్నాం

ఇటీవల మలి విడతలో భాగంగా ప్రభుత్వం 8,260 ఇళ్లు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జిల్లాలోని 4 మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభిస్తాం. జిల్లాలో మెదక్, రామాయంపేట, తూప్రాన్, నర్సాపూర్ నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక పూర్తి కాగా మున్సిపల్ కమిషనర్లు ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్నారు. ఆ ప్రక్రియ పూర్తికాగానే నిర్మాణాలు ప్రారంభించేలా చర్యలు చేపడుతాం.


నిరుపేదలను ఆదుకుంటాం

ఇళ్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుంటాం. జిల్లాలో సుమారు 200 మంది వరకు సొంతిళ్లు నిర్మించుకోలేని నిరుపేదలు ఉన్నట్లు గుర్తించాం. వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం ఇప్పించి ఇంటి నిర్మాణం చేపట్టేలా కృషి చేస్తున్నాం. వారి ఇంటి నిర్మాణం పూర్తయ్యే వరకు అన్ని విధాలుగా ఆదుకుంటాం. ఆర్థికంగా ఉండి ఇళ్ల నిర్మాణం చేపట్టకుంటే మూడు నెలల గడువు ఇస్తాం. అయినప్పటికీ నిర్మాణాలు చేపట్టకుంటే వారి స్థానంలో ఇతర అర్హులకు అవకాశం కల్పిస్తాం.

భూసేకరణ కొలిక్కి..!

పలు గ్రామాల అవార్డులకు ఎన్‌హెచ్ఏఐ ఆమోదముద్ర

- పరిహారం చెల్లించేందుకు రెవెన్యూశాఖ సన్నాహాలు



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రీజనల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వస్తోంది. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం చెల్లించేందుకు రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. భూ సేకరణ ప్రక్రియలో భాగంగా ఇప్పటికే ప్రకటించిన అవార్డు (సేకరించే భూముల సర్వేనంబర్లు, పట్టాదారుల పూర్తి వివరాలు)లకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయం ఆమోదముద్ర వేసింది. మరికొన్నింటికి అప్రూవల్ రావాల్సి ఉంది. ఈ ఆమోదం వచ్చి న వెంటనే నిర్వాసిత రైతులకు పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. తెలంగాణ అభివృద్ధికి గేమ్ చేంజర్‌గా భావిస్తున్న ఈ రహదారి ఉత్తర భాగం 161 కి.మీలు సంగారెడ్డి, ఆందోల్, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్ ఆర్డీఓలు భూసేకరణ ప్రక్రియను చేపట్టారు. ఈ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది.

ఇదీ జరిగింది...

మెదక్ జిల్లా నర్సాపూర్ ఆర్డీఓ పరిధిలో శివంపేట, నర్సాపూర్ మండలాల్లోని 17 గ్రామాల పరిధిలో 1,048 మంది రైతుల వద్ద మొత్తం 758 ఎకరాలు సేకరిస్తున్నారు. దీనికి సంబంధించి 28 అవార్డులను ప్రకటించారు. ఇందులో ఎన్‌హెచ్ఏఐ పీడీ కార్యాలయం నుంచి 13 అవార్డులకు ఇప్పటికే అనుమతి లభించింది. మరో 15 అవార్డులకు అప్రూవల్ వచ్చిన వెంటనే పరిహారం చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. సంగారెడ్డి రెవెన్యూ డివిజన్‌లోని 13 గ్రామాలు, ఆందోల్ డివిజన్‌లోని ఐదు గ్రామాలు కలిపి మొత్తం 824 ఎకరాలు సేకరిస్తున్నారు. సంగారెడ్డి డివిజన్‌కు సంబంధించి 24 అవార్డులకుగాను ఎన్‌హెచ్ఏఐ అధికారులు ఆరింటికి మాత్రమే అప్రూవల్ ఇచ్చారు. ఆందోల్‌కు సంబంధించిన భూసేకరణ అవార్డులకు అప్రూవల్ రావాల్సి ఉంది. తూప్రాన్ ఆర్డీఓ పరిధిలో 430 ఎకరాల భూములను సేకరిస్తున్నారు. ఎనిమిది గ్రామాల్లోని 482 మంది రైతులు నిర్వాసితులుగా మారుతున్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన అవార్డులకు అప్రూవల్ కోసం ఎన్‌హెచ్ఏఐకి పంపనున్నారు. ఈ అప్రూవల్ వచ్చిన వెంటనే రెవెన్యూ అధికారులు నిర్వాసిత రైతులకు పరిహారం పంపిణీ చేస్తారు.

కనీసం రూ.70 లక్షలు చెల్లించాలంటున్న నిర్వాసితులు..

తప్పనిసరి పరిస్థితుల్లో తమ భూములు గుంజుకుంటే భూమికి బదులు భూమి ఇవ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. గతంలో పలుచోట్ల ఈ భూసేకరణకు సంబంధించిన సర్వే పనులను నిర్వాసిత రైతులు అడ్డుకున్న విషయం విదితమే. దీంతో రెవెన్యూ అధికారులు ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. అయితే పరిహారం కింద ఎకరానికి రూ.70 లక్షలు చెల్లించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి వంటి గ్రామాల నిర్వాసితులు ఈ భూసేకరణపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సర్వే పనులను కూడా అడ్డుకున్నారు.

మూడేళ్లలో జరిగిన లావాదేవీలను బట్టి ధర

భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించేందుకు ధర నిర్ణయం చేయాల్సి ఉంది. ఈ ప్రాంతంలో మూడేళ్లుగా జరిగిన భూముల క్రయవిక్రయాలకు ధరను బట్టి...ఈ పరిహారం లెక్కిస్తారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలని రెవెన్యూ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు పరిహారం అందే అవకాశాలు ఉన్నాయని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. కనీసం రూ.70 లక్షలు చెల్లించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ప్రభుత్వ బడిలోనే బంగారు భవిష్యత్



10కే రిలే వాకింగ్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, ఇతర అధికారులు

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్‌మున్సిపాలిటీ/హవేళిఘణాపూర్/నర్సాపూర్ రూరల్: తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించి వారి భవిష్యత్‌కు బంగారు బాటలు వేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బుధవారం మెదక్ మండలం మంబోజిపల్లి నుంచి అవుసులపల్లి వరకు 10కే రిలే వాకింగ్‌ను ప్రారంభించారు. అనంతరం అవుసులపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా సరికొత్త సాంకేతిక విద్యా విధానాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్నామని వివరించారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, మెదక్ ఆర్డీఓ రమాదేవి, డీఈఓ రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, యువజన క్రీడల నిర్వహణ అధికారి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నర్సాపూర్ మండలం చిప్పల్‌తుర్తిలో భూ భారతి రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఈనెల 10 తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 187 గ్రామాల్లో 10,933 దరఖాస్తులు స్వీకరించామన్నారు.

అయిల్‌పాం సాగుకు ఆసక్తి చూపండి

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు అయిల్‌పాం సాగుకు ముందుకు రావాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని సీతారం తండాలో ఆయిల్‌పాం మొక్కలు నాటి మాట్లాడారు. రైతులు ఒకే పంట విధానం కాకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాల్సిన అవసరం ఉందన్నారు. 2025– 26 సంవత్సరంలో 2,500 ఎకరాల్లో అయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. అనంతరం రత్నాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును పరిశీలించారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



పూరి గుడిసె ఎదుట పిల్లలతో రజిత

డబ్బులు లేక.. పనులు ప్రారంభించక

రామాయంపేట(మెదక్): 'ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. చేతిలో చిల్లిగవ్వ లేదు. ముందు పనులు చేస్తే గాని ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల కావు. ఇప్పుడు ఇంటి నిర్మాణం ఎలా' అని మండలంలోని ఝాన్సిలింగాపూర్ పంచాయతీ పరిధిలోని సదాశివనగర్ తండాకు చెందిన గిరిజన మహిళ రజిత ఆవేదన వ్యక్తం చేస్తుంది. గతంలో భర్త విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా, కట్టెలు అమ్మి, కూలీ పనులు చేస్తూ పిల్లలను పెంచి పోషిస్తుంది. ప్రస్తుతం శిథిలమైన పూరి గుడిసెలో నివాసం ఉంటుంది. ఈ క్రమంలో తండాకు మూడు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, అందులో రజిత పేరు ఉంది. అయితే చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇంటి నిర్మాణానికి దూరంగా ఉంటుంది. బేస్‌మెంట్ వరకు నిర్మాణం పూర్తి చేస్తే మొదటి బిల్లు వస్తుందని అధికారులు చెబుతుండగా, డబ్బులు లేకపోవడంతో పనులు ప్రారంభించలేదు. దాతలు సహకరించాలని వేడుకొంటుంది. రజిత ఇళ్లు నిర్మించుకునేందుకు సహాయ సహకారాలు అందజేస్తామని ఎంపీడీఓ సజీలుద్దీన్ హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

సర్కారు బడికి టీచర్ కుమారుడు



విద్యార్థి కార్తీక్‌కు అడ్మిషన్ అందజేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

రామాయంపేట(మెదక్): తాను పనిచేస్తున్న పాఠశాలలోనే ఓ ఉపాధ్యాయురాలు తన కుమారున్ని చేర్పించి ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని రాయిలాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలు ప్రవళిక విధులు నిర్వర్తిస్తున్నారు. జిల్లాలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమంలో భాగంగా ఆమె ప్రైవేట్ స్కూలులో చదువుతున్న కుమారుడు కార్తీక్‌ను తాను పనిచేస్తున్న పాఠశాలలోని మూడో తరగతిలో చేర్పించేందుకు అడ్మిషన్ తీసుకున్నారు. సదరు ఉపాధ్యాయురాలిని మండల విద్యాధికారి శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు. ఎంఈవో విద్యార్థి కార్తీక్‌కు అడ్మిషన్ పత్రాన్ని అందజేశారు.

17మందికి జరిమానా

గజ్వేల్‌రూరల్: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 17మందికి కోర్టు జరిమానా విధించిందని గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి తెలిపారు. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన వాహన తనిఖీల్లో మద్యం తాగి పట్టుబడ్డారని పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ స్వాతిగౌడ్ ఎదుట హాజరు పర్చగా, విచారణ అనంతరం 17 మందికి వెయ్యి రూ. చొప్పున 17వేలు జరిమానా విధించినట్లు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని వ్యక్తి మృతి

పుల్‌కల్(అందోల్): ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా ఇద్దరు యువకులు గాయపడ్డారు. ఎస్‌ఐ క్రాంతి కుమార్ కథనం ప్రకారం... మండల పరిధిలోని తాడ్‌దాన్‌పల్లి గ్రామానికి చెందిన బేగరి యాదయ్య(40) గొంగ్లూర్ గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. గొంగ్లూర్ గ్రామానికి చెందిన అర్జున్, రాజు అనే యువకులు ద్విచక్రవాహనంపై సంగారెడ్డి వైపు వెళుతున్నారు. బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో బేగరి యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అర్జున్,రాజులకు తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. మృతిచెందిన బేగరి యాదయ్య మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ములుగు(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం... మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రావల్‌కోల్ మండలం దొంగలగుట్ట తండాకు చెందిన కోడావత్ రాములు(47)ఈ నెల 5న సాయంత్రం సొంత పనిపై బైక్‌పై ములుగు మండలం కొత్తూరుకు వచ్చి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యాడు. గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న అతడికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం

రామాయంపేట(మెదక్): ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని యువకుడు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి... మండలంలోని కాట్రియాల గ్రామానికి చెందిన ఎరుకలి అశోక్ తన కుటుంబంతో కలిసి పూరి గుడిసెలో నివాసం ఉంటున్నాడు. ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నాడు. పూరిగుడిసె వెనుకభాగంలో నిర్మాణ పనులు ప్రారంభించాడు. కాగా ఇల్లు మంజూరు లిస్టులో అతని పేరు లేకపోవడంతో ఆవేదన చెందాడు. దీంతో మంగళవారం రాత్రి గ్రామ శివారులో క్రిమి సంహారక మందు తాగి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వెంటనే అతడి తండ్రి నర్సింహులు అంబులెన్సులో మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బుధవారం వైద్యులు అశోక్‌ను డిశ్చార్జి చేశారు. ఈ విషయంపై స్థానిక ఎంపీడీవో సజీలుద్దీన్‌ను సంప్రదించగా.. అశోక్‌కు మొదటి లిస్టులో ఇల్లు మంజూరు కాలేదని తెలిపారు.

మొదటిరోజు మారాం చేశా



నన్ను మొదటి సారిగా హైదరాబాద్‌లోని మా ఇంటికి దగ్గరలో ఉన్న నర్సరీలో జాయిన్ చేసినప్పుడు మారాం చేశానట. దీంతో కొన్ని రోజుల పాటు బడికి పంపకుండా ఇంట్లో ఉంచి ఆ తరువాత మా కజిన్ బ్రదర్స్ చదివే మరో పాఠశాలకు పంపించారు. దీంతో నన్ను నేరుగా ఎల్‌కేజీలో చేర్చారు. మా తాతయ్య తరుచుగా తన లూనాపై బడికి తీసుకెళ్లేవారు. అమ్మానాన్నలు సైతం బడిలో దింపేవారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తాను మొదటి సారి బడికి వెళ్లిన స్మృతులను సాక్షితో పంచుకున్నారు. బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలి. ప్రతి ఒక్కరూ చదువుకోవాలి. అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటాం.

–రాహుల్‌రాజ్, మెదక్ కలెక్టర్

అమ్మతో వెళ్లా..



మాది మంచిర్యాల జిల్లాలోని నస్పూర్ గ్రామం. గ్రామంలో ఉన్న సింగరేణి ప్రభుత్వ పాఠశాలలో చదువు పూర్తి చేశాను. పాఠశాలకు ప్రతిరోజు నడుచుకుంటూ వెళ్లే వాళ్లం. మొదటిరోజు తల్లితో పాఠశాలకు వెళ్లాను. సోషల్ సబ్జెక్టుపై ఎక్కువగా ఆసక్తి ఉండేది. అదే పట్టుదల, క్రమశిక్షణతో చదివి ఈరోజు ఈ స్థాయిలో ఉన్నాను. అమ్మానాన్నల ప్రోత్సాహం, వివాహం అనంతరం భర్త సహకారంతో న్యాయవాద వృత్తిని చేపట్టాను. ప్రస్తుతం జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం చదువుతున్న పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలి. పుస్తకాలను ఎక్కువగా చదువుతూ ఉండాలి.

–సౌజన్య, సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి

బడివడిగా.. సరికొత్తగా..

కొబ్బరి తోరణాలు, రంగుల కాగితాలతో పాఠశాలల ముస్తాబు

- ఇప్పటికే శుభ్రం చేసి వసతుల ఏర్పాటు
- చదువులమ్మ ఒడిలో అక్షరాలు దిద్దనున్న విద్యార్థులు
- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. ప్రైవేటుకు దీటుగా మెరుగైన వసతులతో తయారయ్యాయి. ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించడంతో అధునాతన సౌకర్యాలు సమకూరాయి. విద్యుత్, తాగునీటి సౌకర్యమే కాకుండా చాలా పాఠశాలల్లో లైబ్రరీలు, కంప్యూటర్లు, సైన్స్ ల్యాబ్‌లనూ ఏర్పాటు చేశారు. సర్కారు బడుల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లో ఎందరో ఉన్నారు. పాఠశాలల పునఃప్రారంభం వేళ.. కొత్త రంగులద్దుకొని సుందరంగా ముస్తాబయ్యాయి. ఈ నేపథ్యంలో పలువురి మనోభావాలు.. పలు స్కూళ్ల ఘనతపై కథనాలు కొన్ని..



బొర్రగూడెం ప్రాథమిక పాఠశాల గేటుకు కట్టిన మామిడి తోరణాలు



సిద్దిపేటలోని ఉన్నత పాఠశాల ద్వారాన్ని మామిడి తోరణాలు, ముగ్గులతో ముస్తాబు చేస్తున్న సిబ్బంది

మామిడి తోరణాలు కట్టి

వర్గల్(గజ్వేల్): సర్కారు బడులు వేసవి సెలవులు ముగించుకుని గురువారం పునఃప్రారంభమవుతున్న వేళ విద్యార్థిలోకానికి స్వాగతం పలుకుతున్నాయి. ఈ సందర్భంగా వర్గల్ మండలం బొర్రగూడెం ప్రాథమిక పాఠశాలను హెచ్‌ఎం రాజనరేందర్‌రెడ్డి బృందం బుధవారం శుభ్రం చేయించి, మామిడి తోరణాలు కట్టి స్వాగత ఏర్పాట్లు చేశారు. చక్కని చదువుతో భవిష్యత్‌కు పునాదులు వేస్తామని భరోసా కల్పిస్తున్నారు.

ప్రముఖులు చదివిన పాఠశాల

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్‌లోని మెథడిస్ట్ రూరల్ హై స్కూల్ (ఎంఆర్‌హెచ్‌ఎస్) అత్యంత పురాతనమైన ఎయిడెడ్ పాఠశాల. మెథడిస్ట్ సంస్థ 1931లో సుమారు 63 ఎకరాల్లో పాఠశాలను స్థాపించింది. అమెరికాకు చెందిన గార్డెన్ దొర దంపతులు నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షించారు. 94 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పాఠశాలలో 1 నుంచి 10 తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన చేస్తున్నారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయుల కోసం ఇల్లు కట్టించారు. ఆటల కోసం విశాల మైదానం, హాస్టల్ భవనం, బాలబాలికల కోసం టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం తదితర వసతులు కల్పించారు. జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, స్వర్గీయ మాజీ మంత్రి ఫరిదుద్దీన్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తదితర ప్రముఖులు ఇక్కడే చదువుకున్నారు. ఈ పాఠశాలలో చదివిన వారు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా, డాక్టర్లు, ఇంజినీర్లు ఇలా ప్రతి రంగంలో ఉద్యోగాలు చేస్తున్నారు. అప్పట్లో పాఠశాలలో అడ్మిషన్ దొరకడం కష్టంగా ఉండేది. సీట్ల కోసం తీవ్ర పోటీ నెలకొనేది. ప్రస్తుతం పర్యవేక్షణ కొరవడటంతో ఆదరణ తగ్గుతోంది. అయినా ఇప్పటికీ 1200 మంది విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఇక్కడ హెచ్‌ఎంగా పనిచేసిన మిస్ రత్న శేషప్ప, స్వర్గీయ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి చేతుల మీదుగా జాతీయ స్థాయిలో ఉత్తమ టీచర్‌గా అవార్డును అందుకున్నారు.



జహీరాబాద్‌లోని అల్లీపూర్ ఎంఆర్‌హెచ్‌ఎస్ పాఠశాల

ఫలించిన యువకుల ప్రయత్నం

మూతపడిన పాఠశాల పునః ప్రారంభం



మల్లాయపల్లిలో బడిబాటలో అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ప్రభుదాస్, యువకులు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని మల్లాయపల్లి ప్రాథమిక పాఠశాలకు విద్యార్థులు రాకపోవడంతో రెండేళ్ల క్రితం మూతపడింది. గతంలో 26 మందితో కొనసాగింది. కానీ తల్లిదండ్రులు ప్రైవేటుకు పంపించడంతో పాఠశాల మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. తిరిగి తెరిపించేందుకు గ్రామ యువకులు నడుం బిగించారు. మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్‌తో కలిసి తల్లిదండ్రులకు సర్కారు బడిలో విద్యార్థులకందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల గురించి అవగాహన కల్పించారు. దీంతో తల్లిదండ్రులు 15 మందిని పాఠశాలలో చేర్పించడానికి అంగీకారం తెలిపారు.

త్వరలో ఉపాధ్యాయులను నియమిస్తాం

విద్యార్థులు చేరుతుండటంతో అధికారులు సైతం తిరిగి తెరిచేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇద్దరు ఉపాధ్యాయులను నియమించేలా ఉన్నతాధికారులతో చర్చిస్తున్నట్లు ఏంఈఓ ప్రభుదాస్ తెలిపారు. పాఠశాల రెండేళ్లుగా మూతపడి ఉండటంతో ఇటీవల ఏఈ శ్రీకాంత్, ఏంఈఓ ప్రభుదాస్ సందర్శించి మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.



75 సంవత్సరాల చరిత్ర

కొబ్బరి మట్టలతో పాఠశాల ముస్తాబు

హుస్నాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు 75 సంవత్సరాల చరిత్ర ఉంది. ఇటీవల పూర్వ విద్యార్థులతో కలిసి వజ్రోత్సవాలను వైభవంగా జరుపుకుంది. ఎంతో మందిని ఉన్నత స్థానాలకు చేర్చింది. తెలంగాణ రాష్ట్ర మొట్ట మొదటి స్పీకర్ మధుసూదనా చారి, ప్రస్తుతం జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల డైరెక్టర్ గాజుల శ్యాంప్రసాద్ లాల్ ఈ బడిలో చదువుకున్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారు. కంప్యూటర్ ల్యాబ్, స్టెమ్ సైన్స్ ల్యాబ్, రోబోటిక్ ల్యాబ్, ఐఎఫ్‌టీ ప్యానెల్స్, రోజు వారి హాజరు యాప్, బాలికలు, బాలురకు ప్రత్యేక టాయిలెట్స్, తాగునీటి వసతి కోసం వాటర్ ప్లాంట్, కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, 230 డెస్కులు, అన్ని తరగతుల్లో చాక్ బోర్డ్స్, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇప్పించేందుకు ప్రత్యేక టీచర్ నియామకం, ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ప్రత్యేక టాయిలెట్లు ఈ బడి ప్రత్యేకతలు.

పచ్చదనంతో ఆకట్టుకుంటున్న భుజిరంపేట

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని భుజిరంపేటలో ప్రాథమిక పాఠశాల పచ్చదనంతో కళకళ లాడుతుంది. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్నాయి. విద్యార్థులను ఆకట్టుకునేలా పచ్చని చెట్లు, చెమన్ మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడ ఉపాధ్యాయులు వేసవి సెలవులలో సైతం మొక్కలకు నీళ్లపోసి పెంచడంతో పాఠశాల ఆవరణలో దారికి ఇరువైపులా ఉన్న మొక్కలు, ఏపుగా పెరిగిన చెట్లు నీడనిస్తున్నాయి. ప్రాథమిక పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండగా 133మంది విద్యార్థులు ఉన్నారు.



భుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో దారికి ఇరువైపులా ఉన్న చెమన్ మొక్కలు

ఈ పాఠశాలలో చేరేందుకు పోటీ



ఇందిరానగర్‌లో అడ్మిషన్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను అందంగా ముస్తాబు చేశారు. పాఠశాలలను శుభ్రపరిచి, మామిడి తోరణాలతో, రంగు రంగుల పేపర్‌లతో అలంకరించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6వ తరగతితో పాటు 7, 8, 9, 10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు భారీగా తరలివస్తున్నారు. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు పెట్టడం ఆనవాయితీగా వస్తుంది. గురువారం వరకు దరఖాస్తులు తీసుకుని, తరువాత విద్యార్థులకు అడ్మిషన్‌లు ఇవ్వనున్నారు. ప్రతి సంవత్సరం ఈ పాఠశాలలో 12వందలకు పైగా విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

సరస్వతీ నమఃస్తుభ్యం

వర్గల్(గజ్వేల్): సెలవుల విరామం ముగిసింది. బడి గంట సమయం ఆసన్నమైంది. పుస్తకాల సంచులతో, బడివైపు చిన్నారులు పరుగులు తీసే తరుణం మొదలవుతుండటంతో చదువుల తల్లి విద్యాసరస్వతి కొలువుదీరిన వర్గల్ క్షేత్రం చిన్నారుల అక్షరస్వీకారాలతో హోరెత్తుతున్నది. రెండో బాసరగా ఖ్యాతి గడించిన వర్గల్ విద్యాధరి సన్నిధిలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి తల్లిదండ్రులు తరలివస్తున్నారు. గడచిన పది రోజులుగా సగటున 300 అక్షరాభ్యాసాలు జరిగాయి. బుధవారం చిన్నారుల అక్షరభ్యాస సందడి కొనసాగింది. అమ్మవారి సన్నిధిలో 'సరస్వతీ నమఃస్తుభ్యం' అంటూ 300 పైగా చిన్నారులు అక్షరాలు దిద్దారు.



వర్గల్ అమ్మవారి సన్నిధిలో చిన్నారుల అక్షరాభ్యాసం

భార్య వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య



నవీన్ కుమార్ (ఫైల్)

సంగారెడ్డి క్రైమ్: భార్య వేధింపులు తట్టుకోలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రమేష్ వివరాల ప్రకారం..పుల్‌కల్ మండలానికి చెందిన కప్పరితల మల్లేశం, లక్ష్మమ్మ దంపతుల రెండో కుమారుడు నవీన్ కుమార్(29), తోషిబా కంపెనీలో పని చేస్తున్నాడు. మూడేళ్ల క్రితం దుద్దేల గ్రామం వట్‌పల్లి మండలానికి చెందిన స్వరూప రాణితో వివాహం జరిగింది. తర్వాత దంపతులు సంగారెడ్డి పట్టణంలోని గణేశ్ నగర్‌లో నివాసం ఉంటున్నారు. వీరికి పిల్లలు లేరు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో పెద్దల సమక్షంలో పలుసార్లు పంచాయితీ పెట్టి దంపతులకు నచ్చజెప్పారు. ఇటీవల మళ్లీ దంపతుల మధ్య గొడవలు జరగడంతో ఈ నెల 6న స్వరూప రాణి పుట్టింటికి వెళ్లింది. తర్వాత ఆమె పలుమార్లు నవీన్‌కు ఫోన్ చేస్తే ఎత్తలేదు. దీంతో 10వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో మామకు ఫోన్‌లో సమాచారం అందించింది. వెంటనే కుటుంబ సభ్యులు నవీన్ రూమ్‌కు వెళ్లారు. తలుపులు తీయకపోవడంతో పగులగొట్టి చూడగా గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఉన్నాడు. వెంటనే సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు నిర్ధారించి మృతి చెందినట్లు తెలిపారు. సూసైడ్ నోట్‌లో తన మరణానికి కారణం భార్య మానసిక వేధింపులు, ఆమె చేసిన అప్పులే కారణం అని రాశాడు. పోలీసులు సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ వాటర్‌మెన్..

నిజాంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతూ వాటర్ మెన్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం నిజాంపేట మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన కానుగంటి శ్రీను(48) తూప్రాన్ మండలంలోని ఓ గ్రామపంచాయతీలో వాటర్ మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు 20 ఏళ్లగా పిట్స్‌తో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అనారోగ్య కారణంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవ్వరు లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



కానుగంటి శ్రీను(ఫైల్)

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

నంగునూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్ వివరాలు ప్రకారం... మైసంపల్లికి చెందిన ఖాత పరమేశ్వర్ (26) తల్లిదండ్రులు చిన్నతనంలోనే చనిపోడంతో తన చెల్లితో కలిసి నర్మెటలోని అమ్మమ్మ ఇంట్లో ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న పరమేశ్వర్ చెల్లెలి పెళ్లి ఎలా చేయాలో తెలియక ఆందోళన చెందేవాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల కింద బీపీ గోలీలు మింగిన పరమేశ్వర్ అస్వస్థతకు గురయ్యాడు. దీంతో గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. పెదనాన్న చంద్రయ్య ఫిర్యాదు పోలీసులు కేసు నమోదు చేశారు.

ధర్మాజీపేటలో..

దుబ్బాకరూరల్: అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని హబ్షిపూర్ శివారులో జరిగింది. ఎస్‌ఐ గంగరాజ్ వివరాల ప్రకారం.. ధర్మాజీపేట గ్రామానికి చెందిన దివిటి నల్లగొండ(41) గ్రామంలో వ్యవసాయం, కూలీ పనులు చేస్తూ భార్యాపిల్లలతో జీవిస్తున్నాడు. అతడికి మూత్ర పిండాలు దెబ్బతినడంతో ఐదేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఇటీవల గుండెనొప్పి రావడంతో రెండు స్టంట్లు కూడా వేశారు. వైద్య ఖర్చుల కోసం రెండు ప్లాట్లను అమ్మేశాడు. దీంతో ఆర్థిక ఇబ్బందులకు గురయ్యాడు. మెడికల్ షాపులో మందులు తెచ్చుకుంటానని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. బుధవారం ధర్మాజీపేట, హబ్షిపూర్ గ్రామాల మధ్య చెట్టుకు ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇది ప్రభుత్వ భూమి.. కాదు పట్టా భూమి

- ఇరు వర్గాల మధ్య వాగ్వాదం
- పనులను అడ్డుకున్న గ్రామస్తులు, బీజేపీ నాయకులు
- ఎస్‌ఐ హామీతో సద్దుమణిగిన గొడవ

కౌడిపల్లి(నర్సాపూర్): ఇది ప్రభుత్వ భూమి అని కబ్జా చేయవద్దని మండలంలోని వెల్మకన్న గ్రామస్తులు, బీజేపీ నాయకులు జేసీబీతో చేయిస్తున్న పనులను అడ్డుకున్నారు. కాగా ఇది మా సొంత భూమి అని పట్టా కూడా ఉందని స్థలం యజమాని వాదించాడు. దీంతో ఇరువురి మధ్య గొడవ జరగగా పోలీసులకు విషయం తెలియడంతో నచ్చజెప్పారు. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన మోతీలాల్‌గౌడ్‌కు గ్రామ సమీపంలో వెల్మకన్న శివారులో వ్యవసాయ భూమి ఉంది. కాగా బుధవారం జేసీబీతో ఆ స్థలంలో రాళ్లు తొలగించి చదును చేస్తున్నాడు. ఇది గమనించిన గ్రామస్తులు, బీజేపీ నాయకులు రాజేందర్, రాకేష్, అశోక్, రవి సాగర్ తదితరులు జేసీబీ ఆపాలని అడ్డుకున్నారు. దీంతో గొడవ జరుగుతుండటంతో స్థానిక ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి, పోలీసులు అక్కడి చేరుకుని ఇరువురికి నచ్చజెప్పారు. పట్టాభూమిలో పనులు చేసుకుంటున్నానని మోతీలాల్‌గౌడ్ చెప్పగా, ఇది ప్రభుత్వ భూమి అని వెల్మకన్న గ్రామస్తులు వాదించారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. దీంతో ఎస్‌ఐ తహసీల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ప్రస్తుతం తహసీల్దార్, ఇతర రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సుల్లో ఉన్నారని, అవి ముగిసిన తరువాత భూమి సర్వేచేసి హద్దులు నిర్వహిస్తామని ఎస్‌ఐ సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది.



జేసీబీని అడ్డుకుంటున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

ఇంటి కోసమే పెదనాన్న హత్య

- తమ్ముడు కుమారుడి రిమాండ్
- వివరాలు వెల్లడించిన బీడీఎల్ సీఐ స్వామి గౌడ్

పటాన్‌చెరు టౌన్ : ఇంటిని దక్కించుకుందామని ప్లాన్ ప్రకారం పెదనాన్నపై దాడి చేసి పెట్రోలు పోసి నిప్పంటించాడు. ఈ హత్య కేసులో నిందితుడిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం బీడీఎల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో సీఐ స్వామి గౌడ్ వివరాలు వెల్లడించారు. పటాన్‌చెరు మండలం ఘనపూర్‌కు చెందిన చెర్ల రాములు(55)కు గ్రామంలో పాత ఇల్లు ఉంది. భార్యాపిల్లలతో కలిసి అతడు రామచంద్రాపురం అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కాగా రాములు తమ్ముడి కొడుకు దిలీప్ పక్క పోర్షన్‌లోనే ఉంటున్నాడు. అయితే ఆయనకు తెలియకుండా ఇంట్లో ఉన్న సామగ్రిని ఇంటి బయట సజ్జాపై పడేసి, ఓ మహిళకు అద్దెకిచ్చాడు. ఈనెల 5వ తేదీ రాత్రి రాములు గ్రామానికి వచ్చి తన ఇంట్లో ఉన్న మహిళను ఇల్లు అద్దెకు ఎవరిచ్చారని ప్రశ్నించాడు. అప్పుడే వచ్చిన తమ్ముడి కొడుకు దిలీప్‌కి ఆ మహిళ విషయం చెప్పింది. నా ఇంటిని కిరాయికి ఎలా ఇస్తావని దిలీప్‌పై అరిచాడు. ఇంటిని దక్కించుకుందామని ప్లాన్ వేసుకున్న దిలీప్ కట్టెల పొయ్యిలో ఉన్న కట్టె తీసుకొని విచక్షణారహితంగా కొట్టాడు. రాములు చేయి విరిగి కింద పడిపోగా ఎలాగైనా అంతమొందించాలని నిర్ణయించుకొని స్కూటీపై గ్రామంలోని కిరాణాషాప్‌కు వెళ్లి బాటిల్‌లో పెట్రోలు తీసుకొచ్చాడు. వాకిట్లో పడి ఉన్న రాములుపై బట్టలు తీసుకువచ్చి మీద వేసి పెట్రోలు పోసి నిప్పంటించాడు. అతను చనిపోయాడనుకొని స్కూటీపై కొద్ది దూరం వెళ్లి గమనిస్తున్నాడు. ఈ క్రమంలో రాములు మంటల్లో నుంచి లేచి ఇంటి ప్రక్కన ఉన్న డ్రమ్ములో నీళ్ళు పోసుకొని మంటలను ఆర్పుకున్నాడు. మళ్లీ దిలీప్ రాములు వద్దకు వచ్చి కట్టెతో కొట్టగా అతడు కింద పడిపోగా, ఈడ్చుకుంటూ వెళ్లి మంటల్లో పడేశాడు. అనంతరం అక్కడి నుంచి పారిపోయి హైదరాబాద్‌కు వెళ్లాడు. దీంతో తీవ్రంగా గాయపడిన రాములును ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. పోలీసులు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడి కోసం గాలిస్తుండగా బుధవారం ఉదయం ఇంటికి బట్టలు తీసుకునేందుకు వచ్చిన దిలీప్‌ను సీఐ స్వామి గౌడ్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి సిబ్బందితో వెళ్లి అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన స్కూటీ, ఫోన్, పెట్రోల్ బాటిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ స్వామి గౌడ్